# మీ ఆంతర్యాల పట్ల శ్రద్ధ వహించండి


ప్రియమైన మిత్రులారా,

ఈ సంతోషకరమైన జన్మాష్టమి రోజున, నేను చైతన్యం గురించి, శక్తి గురించి కొన్ని ఆలోచనలను మీతో పంచుకోవాలనుకుంటున్నాను.

బాబూజీ ప్రకారం, శక్తిని సద్వినియోగం చేసుకోకపోతే అది నిర్ణీత సమయంలో తనను తాను నాశనం చేసుకుంటుంది. కానీ, శక్తిని ఎప్పటికీ నాశనం చేయలేమనీ, రూపాంతరీకరణ మాత్రం చెయ్యగలమనీ విజ్ఞాన శాస్త్రం చెబుతుంది. అయితే, మనం శక్తి ధ్వంసం చేయబడినట్లు అర్థం చేసుకున్నా, లేదా రూపాంతరీకరణ చేయబడినట్లు అర్థం చేసుకున్నా, మనం గనుక విద్యను పొందడం కోసం గానీ లేదా అవిద్యను పొందడం కోసం గానీ శక్తిని ఉపయోగించనప్పుడు, మరింత అధ్వాన్న పరిస్థితి ఏర్పడవచ్చు – శక్తి స్తంభించి పోతుంది. అందుకే ఒక సోమరి వ్యక్తిగా ఉండడం మంచిది కాదు. ఒక సోమరి వ్యక్తి ఏ చెడ్డ పనీ చేయడం లేదు కదా అని ప్రజలు అనుకుంటారు. కానీ స్తబ్దత, అంటే, ఏ పనీ చేయకుండా ఉండడం అనేది, మీకు మీరు చేయగలిగిన అధమాధమమైన విషయం. సోమరితనం ఒక స్థాయి సంస్కారాలను కూడా సృష్టిస్తుంది; ఎందుకంటే స్థాల్యం పేరుకుపోతూనే ఉంటుంది కాబట్టి.

మీలో జేమ్స్ అలెన్ పుస్తకం, 'యాజ్ ఎ మ్యాన్ థింకెత్'ను చదివిన వారు ఈ క్రింది వరుస క్రమాన్ని గుర్తుంచుకుంటారు: ఆలోచనలు చర్యకు దారితీస్తాయి, చర్య ఫలితాలకు దారి తీస్తుంది, ఫలితం స్వభావానికి దారి తీస్తుంది, స్వభావం విధికి దారి తీస్తుంది. అయినా, ఆలోచనల కంటే ముందు మరొక విషయం ఉంది – సంస్కారాలు. ఈ సంస్కారాలు, మన ఆలోచనా ప్రక్రియకు రంగులు వేస్తాయి, మన అవగాహనకి, మన గ్రహణ శక్తికి ఫిల్టర్‌లను (రంగుటద్దాలను) జోడిస్తాయి.

కానీ సంస్కారం ఒక ఆలోచనగా వ్యక్తమయ్యే ముందు, మనం ఒక  ఉద్దేశపూరిత సంకల్పాన్ని చేసే అవకాశం ఉంది. అది, అప్పటికే నిర్ధారించబడిన మార్గాన్ని మార్చగలదు. వాస్తవానికి, ఇది ఏ దశలోనైనా జరగవచ్చు; తద్వారా అంతిమంగా అది మన విధిని మారుస్తుంది. మన సహజమార్గ అభ్యాసాలన్నీ సంకల్పం యొక్క ఉపయోగంపై ఆధారపడి ఉంటాయి.  ఇలా  జోక్యం చేసుకోవడం అనేది ఏ దశలోనైనా జరగవచ్చు.



ఈ విశ్వమంతా శక్తితో ప్రకంపిస్తోంది. వ్యక్తీకరించబడిన పదార్థంగా మనం చూసేది కూడా ఘనీభవించిన శక్తియే. ఎలక్ట్రాన్ లోపల చలనంలో ఉన్న శక్తి ఒక నిర్దిష్ట వేగంతో నిర్దిష్ట దిశలో తిరుగుతుంది – ఆ భ్రమణం యొక్క కోణం ప్రతికూల చార్జ్‌ను సృష్టిస్తుంది. భ్రమణం అధిక వేగంతో వ్యతిరేక దిశలో ఉన్నప్పుడు, ధనాత్మక చార్జ్‌తో ప్రోటాన్ సృష్టించబడుతుంది. న్యూక్లియస్ లోపల ప్రతికూల, సానుకూల భ్రమణాల యొక్క సంక్లిష్ట శక్తి కదలిక న్యూట్రాన్‌ను సృష్టిస్తుంది; ఛార్జీలు ఒకదానికొకటి రద్దు చేసుకున్నపుడు భారం సృష్టించబడుతుంది. క్వార్క్‌లు, ఊహాత్మక టాకియాన్‌ల వంటి అనేక ఇతర ఉప-పరమాణు కణాలు ఉన్నాయి. దీనితో శక్తి కదలికలో అనేక వైవిధ్యాలు ఉన్నాయి. ఇవన్నీ వివిధ నిష్పత్తులలో మిళితమవుతున్న శక్తులు. అవే ఈ వ్యక్తమైన విశ్వాన్ని సృష్టిస్తున్నాయి.

అదే విధంగా, ఒక వ్యక్తి యొక్క మనస్సు ద్వారా, ఆ వ్యక్తి యొక్క చైతన్యం ద్వారా ప్రవహించే శక్తి, ఆ చైతన్యం లోని ఫిల్టర్‌ల ఆధారంగా ఒక నిర్దిష్ట క్షేత్రాన్ని సృష్టిస్తుంది. చైతన్యం యొక్క ఒక క్షేత్రం గుండా వెళ్ళే శక్తి ద్వేషంగా వ్యక్తమవుతుంది, అయితే చైతన్యం యొక్క మరొక క్షేత్రం గుండా వెళుతున్న శక్తి ప్రేమగా వ్యక్తమవుతుంది. ఎన్నో రకాల పరమాణు కణాలు ఉన్నట్లే, వీటి మధ్యలో అనేక లక్షణాలు ఉండడానికి అవకాశం ఉందని అని మనం గ్రహిస్తాం. ఉదాహరణకు, ఒక నిర్దిష్ట చైతన్యం దయ, కరుణ, సహానుభూతిగా ఉంటుంది; మరొకటి అత్యాశతోనూ, స్వార్థంతోనూ కూడి ఉంటుంది. ఇంకా మరొకటి ఉదాసీనంతో కూడి ఉంటుంది.

ఈ వ్యత్యాసాలు వ్యక్తుల మధ్య చూడవచ్చు. అంతేకాక అవి ఒకే వ్యక్తిలో వేర్వేరు సమయాల్లో కూడా కనిపిస్తాయి. ఉదాహరణకు, మీకు ఒక వ్యక్తి పట్ల అపరిమితమైన ప్రేమ ఉందనుకోండి, కానీ మీరు అనుభూతి చెందే విధం మారే ఒక పరిస్థితి ఏర్పడుతుంది అనుకోండి. అవతలి వ్యక్తి గురించి మీ మారిన అవగాహన, శక్తి యొక్క ప్రవాహాన్ని మారుస్తుంది. ఫలితంగా, మీ స్వంత (ఆధ్యాత్మిక) చక్రాలు ప్రభావితమవుతాయి. ఆ పరిస్థితుల గురించి మళ్లీ మళ్లీ ఆలోచించడం ద్వారా మీ మారిన అవగాహన మరింత బలపడుతుంది. మారుతున్న చైతన్యం యొక్క 'కాన్వాస్' ఇప్పుడు మనం మాట్లాడుతున్న ఈ శక్తి క్షేత్రం అన్నమాట.

**ఒక వ్యక్తి యొక్క మనస్సు ద్వారా,**

**ఆ వ్యక్తి యొక్క చైతన్యం ద్వారా ప్రవహించే శక్తి,**

**ఆ చైతన్యంలోని ఫిల్టర్‌ల ఆధారంగా ఒక నిర్దిష్ట క్షేత్రాన్ని సృష్టిస్తుంది.**

మనం ఒకరితో ఒకరు పరస్పరం వ్యవహరించేటప్పుడు మరిన్ని సంక్లిష్టతలు వాటికి తోడవుతాయి – ఎందుకంటే, మనం ఒకరినొకరు మోసం చేసుకుంటాం కాబట్టి. మీరు ఎవరినైనా ద్వేషించవచ్చు, వారిని మోసం చేయాలనుకోవచ్చు – అది మీ లోపల ఉన్న ఉద్దేశం – కానీ మీరు పైకి నవ్వుతూనే ఉంటారు. మీ శక్తి క్షేత్రానికి, మీ బాహ్య క్షేత్రానికి మధ్య పొంతన ఉండదు. మీ చూపులు మోసపూరితంగా ఉంటాయి, కాబట్టి మీ శక్తి క్షేత్రం వక్రీకరించబడుతుంది. మీ మనస్సు, మెదడుల మధ్య ఉన్న అసమతుల్యత సంక్లిష్టతలను సృష్టిస్తుంది. అప్పుడు, మీ భావనలు మీ హృదయం లోపల సంక్లిష్టతలను సృష్టిస్తాయి. అంతేకాక చేతన మరియు ఉపచేతన మనస్సుల మధ్య సంక్లిష్టతలు కూడా ఉండవచ్చు. ఎందుకంటే, సాధారణంగా మనకు ఉపచేతన గురించి తెలియదు.

కాబట్టి, మీ ఆంతర్యాల గురించి, ఉద్దేశాల గురించి శ్రద్ధ వహించండి. ఒక ఉద్దేశ్యం మీ ఆలోచనా విధానాన్ని మార్చగలదు. మీరు ఆ అవకాశాన్ని కోల్పోతే, మీ సాంస్కారిక సరళి ఆలోచనగా మారితే, మీరు ఏదైనా చర్య తీసుకునే ముందు మీ ఆలోచనా విధానాన్ని మార్చుకునే సామర్థ్యం మీకు ఇంకా ఉంటుంది. ఋషులు, సాధువులు నివారణ మార్గాన్ని ఉపయోగిస్తారు – వారు తమ ఉద్దేశాలను సరిదిద్దుకుంటారు. బుద్ధిమంతులు తమ ఆలోచనలను సరిదిద్దుకుంటారు. ఆచరణాత్మక వ్యక్తులు వారి చర్యలను సరిదిద్దుకుంటారు. క్లీనింగ్ అన్ని దశలలోనూ జోక్యం చేసుకోగలదు.

ఈ క్రమంలో మాస్టర్ పాత్ర ఏమిటి? మనం అనుమతిస్తే మాస్టర్ మన చైతన్యం మీద ప్రభావం చూపుతారు. మనం ఆయనతో అనునాదిస్తే మనం ఆయన యొక్క చైతన్యాన్ని అరువుగా తీసుకుంటాం అన్నమాట. తద్వారా మనం మన పరిమిత దృష్టితో చూడడానికి బదులు ఆయన దృష్టితో చూడగలుగుతాము. ఇది ఒక చిన్న పిల్లవాడు తన తండ్రి కళ్ళతో ప్రపంచాన్ని గ్రహించినట్లుగా ఉంటుంది – పిల్లవాడు తండ్రి భుజాలపై కూర్చున్నప్పుడు తండ్రి ఎలా చూస్తాడో అలాగే ప్రపంచాన్ని చూస్తాడు. అతను ఆ క్షణంలో తన తండ్రిలా మారకపోవచ్చు, అయినా అతను తన తండ్రిలాగే ప్రపంచాన్ని చూడడానికి తనని ఆయన భుజాల పైన మోయమని అడగవచ్చు. అదేవిధంగా, మాస్టర్ మనల్ని తీసుకువెళతారు.

ఈ విధంగా, నిరంతర స్మరణ వివిధ పార్శ్వాలను కలిగి ఉంటుంది. ఇది ధ్యానంతోనూ, ఆ స్థితిని నిలుపుకోవడంతోనూ ప్రారంభమవుతుంది. ఆ తరువాత అది "నేను నా మాస్టర్ కోసం ప్రతిదీ చేస్తున్నాను" అనే ఆలోచన తోడయ్యేవరకూ విస్తరిస్తుంది. అప్పుడు మనం పనులు చేస్తున్నప్పుడు ఆయనలో లీనమయ్యే ఒక దశ వస్తుంది; ఆ సమయాల్లో మనం వేర్వేరు ఫిల్టర్లను ఉపయోగిస్తాము.

మాస్టారు ఒక ప్రభావం చూపాలంటే, మనం మన పాత పద్ధతిని సహించలేని స్థితికి చేరుకోవాలి. మాస్టర్ మనందరిపై ఒకే రీతిగా పనిచేస్తారు, కానీ ఫలితాలు వేర్వేరుగా ఉంటాయి. అందరిలోనూ అలాంటి స్థితిని ఆయన ఎందుకు సృష్టించలేకపోతున్నారు? ఎందుకంటే, విజయం అనేది అభ్యాసి చేతిలో ఉంది, మాస్టర్ చేతుల్లో కాదు. అందుకే మనం సాధన చేస్తాం, అందుకే మనకు ఒక సజీవ గురువు కావాలి. మనతో పోరాడలేని, మనం మారడం కోసం మనల్ని చికాకు పెట్టి మనల్ని సవాలు చెయ్యలేని ఒక మరణించిన వ్యక్తిని మనం ఎలా శరణుకోరగలం?

ప్రేమ, గౌరవాలతో,

**కమలేష్**

**జన్మాష్టమి శుభ సందర్భంగా సందేశం**

**ఆగస్టు 19, 2022, కాన్హా శాంతి వనం**

heartfulness
advancing in love